క్లుప్తంగా

జీహెచ్‌ఎంసీని అప్పుల కుప్పలా మార్చేశారు: సామ

లింగోజిగూడ: జీహెచ్‌ఎంసీ నిధులను దారి మళ్లించి దానిని అప్పుల కుప్పలా మార్చేరని బీజేపీ రంగారెడ్డి జిల్లా అర్బన్ అధ్యక్షుడు సామ రంగారెడ్డి అన్నారు. ఇంటింటికీ బీజేపీ కార్యక్రమంలో భాగంగా శనివారం లింగోజిగూడ డివిజన్ పరిధిలోని ఎల్‌బీనగర్ ఓల్డ్ విలేజ్‌లో బీజేపీ కార్యకర్తలు, నాయకులతో కలిసి పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా రంగారెడ్డి మాట్లాడుతూ, ఎస్ఎన్‌డీపీ కాంట్రాక్టర్లకు నిధులు మంజూరు చేయకపోవడంతో పనులను మధ్యలోనే నిలిపేశారని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు విజయ్ భాస్కర్, గణేష్‌గౌడ్, కిరణ్‌కుమార్, జగదీశ్‌కుమార్, రమేష్‌గుప్తా, ప్రకాష్ గుప్తా, రాకేష్, రాహుల్, రాజ్‌విల్కన్స్, భరత్, కృష్ణంరాజు, నాగరాజు, హరిప్రసాద్ పాల్గొన్నారు.

గణితాన్ని సులభంగా నేర్పాలి

సాక్షి,సిటీబ్యూరో: విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో గణితాన్ని సులభంగా నేర్పాలని డిప్యూటీ ఈఓ రాధాకృష్ణ ఉపాధ్యాయులకు సూచించారు. సైదాబాద్ మండలంలో ఎఫ్ఎల్ఎన్ గణిత శిక్షణ ముగింపు కార్యక్రమంలో ఎస్టీయూ పక్షాన ఆర్పీలను సన్మానించారు. కార్యక్రమంలో నోడల్ ఆఫీసర్ కనకవల్లి, ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి రామ సుబ్బారావు, జిల్లా మహిళా కార్యదర్శి ఆశ, సైదాబాద్ మండల అధ్యక్షుడు వెంకట రెడ్డి, ప్రధాన కార్యదర్శి రెహమాన్, ఆర్పీలు విజయలక్ష్మి,హెప్సీబా, సాంబశివరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

డాక్టర్ క్యారోలిన్‌కు బెస్ట్ సెక్రటరీ అవార్డు



మలక్‌పేట: లయన్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 320 ఏ నుంచి లయన్ డాక్టర్ వీజేఈ క్యారోలిన్ లయన్ ఇంటర్నేషనల్ నవభారత్ క్లబ్ బెస్ట్ సెక్రటరీ అవార్డు అందుకున్నారు. 2022–23 సంవత్సరంలో చేసిన సేవలకు గుర్తింపుగా జిల్లా గవర్నర్ లయన్ జూలూరి రఘు శుక్రవారం రాత్రి నగరంలో జరిగిన పురస్కార ప్రదానోత్సవంలో ఆమెను బెస్ట్ సెక్రటరీ అవార్డుతో సత్కరించారు. పురస్కారం దక్కడం పట్ల క్యారోలిన్ సంతోషం వ్యక్తం చేశారు. మరింతగా సేవా కార్యక్రమాల్లో భాగస్వామ్యం కావడానికి అవార్డు తన బాధ్యతను పెంచిందన్నారు.

మండీ కాదు.. చెత్త కుండీ!

- పారిశుద్ధ్య నిర్వహణ కరువు
- రోగాల బారిన రైతులు, వ్యాపారులు
- వసూళ్లకే పరిమితమైన యాజమాన్యం
- ప్రభుత్వం స్వాధీనం చేసుకుని అభివృద్ధి చేయాలని రైతుల డిమాండ్



డంపింగ్‌యార్డును తలపిస్తున్న మాదన్నపేట మార్కెట్

చంచల్‌గూడ: జంటనగరవాసులకు తాజా కూరగాయలు అందించే మాదన్నపేట కూరగాయల మార్కెట్ అపరిశుభ్రతకు కేరాఫ్ అడ్రస్‌గా మారింది. మురుగు, వరదనీరు, చెత్తాచెదారం, కుళ్లిన వ్యర్థాలతో దుర్గంధం వెదజల్లుతోంది. దీంతో రైతులు, వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడికి వస్తే రోగాల బారిన పడక తప్పదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వసూళ్లకే మార్కెట్ కమిటీ పరిమితం...

కమీషన్ ఏజెంట్ వ్యవస్థ ద్వారా రైతుల నుంచి వచ్చే ఆదాయంపై మాత్రమే మార్కెట్ కమిటీ దృష్టి పెడుతోంది గానీ చెత్త తరలింపునకు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. చెత్త తరలింపు విషయంలో వ్యవసాయ మార్కెట్ శాఖ, జీహెచ్‌ఎంసీ శాఖల మధ్య సమన్వయ లోపం స్పష్టంగా కనిపిస్తోంది. ప్రభుత్వానికి కమిషన్ వ్యవస్థ ద్వారా నెలకు లక్షల రూపాయల ఆదాయం వస్తున్నా..మండీలో రైతుల సంక్షేమం, కనీస సౌకర్యాలకు ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయడంలేదు.

దుర్వాసనతో సహవాసం..

మండీలో పారిశుద్ధ్యం సక్రమంగా లేకపోవడంతో రైతులు, వ్యాపారులు ఆరోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారు. మాదన్నపేట మండీలోని సమస్యలపై ఇటు ప్రభుత్వంగానీ, హైదరాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ గానీ దృష్టి పెట్టకపోవడం గమనార్హం.

ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని డిమాండ్.

దశాబ్దాలు గడుస్తున్నా మార్కెట్‌లో సౌకర్యాలపై భూ యాజమాన్యం గానీ మార్కెట్ శాఖ గానీ దృష్టి సారించడం లేదని రైతులు, వ్యాపారులు ఆరోపిస్తున్నారు. అద్దెలు వసూలు చేస్తున్న కమిటీలు మార్కెట్ అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వడం లేదని, ప్రభుత్వం స్వాధీనం చేసుకుని అభివృద్ధి చేయాలని పలువురు కోరుతున్నారు.

డివిజన్‌ను ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతా: వంగ



సుల్తానాఅల్వా కాలనీలోని సమస్యలను పరిశీలిస్తున్న మధుసూదన్‌రెడ్డి

చంపాపేట: చంపాపేట డివిజన్ పరిధిలోని పలు కాలనీల్లో నెలకున్న మౌలిక సమస్యలన్నింటినీ ప్రాధాన్యతా క్రమంలో దశలవారీగా పరిష్కరించి చంపాపేటను ఇతర డివిజన్‌లకు ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతానని స్థానిక డివిజన్ కార్పొరేటర్ వంగ మధుసూదన్‌రెడ్డి అన్నారు. శనివారం ఆయన సర్కిల్, వాటర్ వర్క్స్ అధికారులతో కలిసి బైరామల్‌గూడ పాత బస్తీ, క్రాంతినగర్, సుల్తానాఅల్వా, అంబేడ్కర్‌వాడ వంటి పలు కాలనీల్లో పాదయాత్ర నిర్వహించి కాలనీల్లో మురుగు సమస్య, నిర్మాణ దశలో ఉన్న ఫంక్షన్‌హాల్ పనులను పరిశీలించారు. అనంతరం మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ...త్వరలో క్రాంతినగర్ కాలనీ రోడ్ నం.2 నుంచి న్యూపద్మానగర్ కాలనీ వరకు భూగర్భ డ్రైనేజీ విస్తరణ పనులు ప్రారంభిస్తామని స్పష్టం చేశారు. సర్కిల్ ఏఈ సురేష్, జలమండలి డీజీఎం సరిత, మేనేజర్ రమ్యభారతి, సిబ్బంది యాదగిరి, శేఖర్, డివిజన్ బీజేపీ అధ్యక్షుడు పోరెడ్డి రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

సైదాబాద్‌కు వచ్చిన గవర్నర్ దత్తాత్రేయ

సైదాబాద్: హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ శనివారం సైదాబాద్‌కు వచ్చారు. నగర మాజీ డిప్యూటీ మేయర్ సుభాష్‌చందర్జీ ఇంటికి విందుకు హాజరై అతని కుటుంబసభ్యులను ఆప్యాయంగా పలకరించారు. సైదాబాద్‌కు దత్తాత్రేయ వచ్చిన సమాచారం తెలిసి పాతబస్తీకి చెందిన పలువురు పార్టీ సీనియర్ నాయకులు, పాత మిత్రులు అక్కడికి చేరుకున్నారు. సుభాష్‌చందర్జీ ఇంట్లో విందు ముగిశాక పాత మిత్రులతో గవర్నర్ దత్తాత్రేయ కొంత సేపు ముచ్చటించారు. యనను కలిసిన వారిలో బీజేపీ భాగ్యనగర్ జిల్లా అధ్యక్షుడు సంరెడ్డి సురేందర్‌రెడ్డి, కార్పొరేటర్ కొత్తకాపు అరుణారవీందర్‌రెడ్డి, సహదేవ్‌యాదవ్, దినేష్ గౌలీకర్, ఆశీష్ గౌలీకర్ ఉన్నారు.

పరామర్శ..

ఎల్‌బీనగర్: హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ శనివారం బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ గ్రీన్ మెడోస్‌లో నివాసం ఉండే తన వ్యక్తిగత కార్యదర్శి రమణ ఇంటికి వచ్చారు. రమణ కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకున్న దత్తాత్రేయ ఆయనను పరామర్శించి ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి పాల్గొన్నారు.



సుభాష్‌చందర్జీ కుటుంబసభ్యులతో హరియాణా గవర్నర్ దత్తాత్రేయ

సుధీర్‌రెడ్డికి గ్రూప్ 2 అభ్యర్థుల సత్కారం



ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డిని సన్మానిస్తున్న గ్రూప్ 2 అభ్యర్థులు

ఎల్‌బీనగర్: ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డిని గ్రూప్ 2 పరీక్ష రాసే అభ్యర్థులు కలిసి సత్కరించారు. అసెంబ్లీ సమావేశాల్లో సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ, ఆగస్టులో గ్రూప్ 2 పరీక్షలు, సెప్టెంబర్‌లో జూనియర్ లెక్చరర్, పాలిటెక్నిక్ కళాశాల లెక్చరర్ పరీక్షలు ఉండటంతో అభ్యర్థులు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. మూడు పరీక్షలకు సెలబస్ వేర్వేరుగా ఉందని, ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకొని గ్రూప్ 2 పరీక్షలను అక్టోబర్‌కు వాయిదా వేయాలని కోరారు. తమ సమస్యలను అసెంబ్లీలో ప్రస్తావించినందుకు గ్రూప్ 2 అభ్యర్థులు ఆయనను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. మరోసారి ఈ విషయాన్ని మంత్రి దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారం అయ్యేలా చూడాలని వారు సుధీర్‌రెడ్డిని కోరగా, తన వంతు కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు.

‘మాతృశ్రీ’లో 5జీ టెక్నాలజీ పురోగతిపై టెక్నికల్ వర్క్‌షాప్



సాక్షి, సిటీబ్యూరో: నగరంలోని మాతృశ్రీ ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో ఇనిస్టిట్యూషన్ ఆఫ్ ఇంజినీర్స్ ఇండియా (ఐఈఐ) భాగస్వామ్యంతో 5జీ యాడ్ బియాండ్ టెక్నాలజీలో ఇటీవలి పురోగతిపై మూడు రోజుల టెక్నికల్ వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ నెల 3న ప్రారంభమైన ఈ కార్యక్రమం శనివారం వరకు కొనసాగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథి హాజరైన టీసీఎస్ చీఫ్ సైంటిస్ట్–సైబర్‌నెటిక్స్ హెడ్ ఎంజీపీఎల్ నారాయణ మాట్లాడుతూ, వైర్‌లెస్ కమ్యూనికేషన్స్‌లో 5జీ నుంచి 6జీకి మారడంలో విప్లవాత్మక పరివర్తనలో సవాళ్లను అర్థం చేసుకోవాల్సిన అవసరముందన్నారు. అనంతరం ఇందులో పాల్గొనే వారికి ప్రిన్సిపాల్ డాక్టర్ హనుమతరావు, వర్క్‌షాప్ కోఆర్డినేటర్ డాక్టర్ ఎన్.శ్రీనివాసరావు, డాక్టర్.ఎం.సుశాంత్ బాబు ఐఐటీ, ఐఐఎస్‌సీ వక్తల వివరాలు, టెక్నికల్ వర్క్‌షాప్ లక్ష్యాన్ని తెలియజేశారు. ఐఈఐ చైర్మన్ బి.బ్రమ రెడ్డి 5జీ విస్తరణ, పరిష్కారాలలో పరిశోధన సవాళ్ల గురించి వివరించారు.

అనాథ బాలికల ఆశ్రమానికి నిత్యావసరాల వితరణ



నిత్యావసరాలు అందజేస్తున్న విద్యార్థులు

చంపాపేట: కర్మన్‌ఘాట్‌లోని నాగార్జున ది నెక్స్ట్ జెన్ పాఠశాల విద్యార్థులు తాము సేకరించిన విరాళాలతో సైదాబాద్‌లోని వైదేహీ అనాథ బాలికల ఆశ్రమానికి శనివారం నాలుగు క్వింటాళ్ల బియ్యం, 50 కేజీల కందిపప్పు తదితర నిత్యావసర వస్తువులు అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ కట్టా రవీందర్ రెడ్డి మాట్లాడుతూ, నాగార్జున విద్యా సంస్థల చైర్మన్ గుమ్మికొండ విఠల్‌రెడ్డి జన్మదినం సందర్భంగా ప్రతీ విద్యా సంవత్సరం పాఠశాలలో ఛారిటీ డే నిర్వహిస్తూ అనాథ ఆశ్రమంలో నిత్యావసర సరుకులను అందజేయడం ఆనవాయితీగా వస్తోందన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జీలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, ఆశ్రమ నిర్వాహకులు మురళీధర్‌రావు, నరసింహారావు, అంబదాస్, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

అన్ని వర్గాలకు ప్రభుత్వం సముచిత ప్రాధాన్యం

సైదాబాద్: తెలంగాణ ప్రభుత్వం అన్నివర్గాల వారి పండుగలకు సముచిత ప్రాధాన్యం ఇస్తోందని యాకత్‌పురా బీఆర్ఎస్ ఇన్‌చార్జ్ సామ సుందర్‌రెడ్డి అన్నారు. శనివారం ఐఎస్‌సదన్‌లో డివిజన్ మాజీ కార్పొరేటర్ సామ స్వప్నారెడ్డితో కలిసి పలు ఆలయాల కమిటీల ప్రతినిధులకు బోనాల సందర్భంగా దేవాదాయ శాఖ నుంచి మంజూరైన చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆషాఢ మాసంతో పాటు శ్రావణ మాసంలోనూ పాతబస్తీలోని పలు అమ్మవారి ఆలయాల్లో సాంప్రదాయబద్ధంగా బోనాలు నిర్వహిస్తారన్నారు. ప్రభుత్వం అందిస్తున్న నిధులతో ఆలయాలను అందంగా తీర్చిదిద్దటమే కాకుండా ఆలయాల వద్ద భక్తులకు అసౌకర్యాలు కలుగకుండా తగిన ఏర్పాట్లు చేయాలని ఆలయాల కమిటీల ప్రతినిధులకు ఆయన సూచించారు.

‘ఆర్టీసీ విలీన బిల్లును వెంటనే ఆమోదించాలి’



హయత్‌నగర్: ఆర్టీసీ విలీన బిల్లుపై గవర్నర్ తీరును నిరసిస్తూ శనివారం ఉదయం కార్మికులు ఆందోళనకు దిగారు. హయత్‌నగర్‌లోని రెండు డిపోలకు చెందిన సుమారు 400 బస్సులను డిపోల్లోనే నిలిపివేశారు. 43 వేల మంది కార్మికుల కుటుంబాల భవిష్యత్‌తో ముడిపడిన విషయం కాబట్టి ప్రభుత్వంలో ఆర్టీసీ విలీన బిల్లును గవర్నర్ వెంటనే ఆమోదించాలని నినాదాలు చేశారు. ఉదయం పూట బస్సుల తిరగకపోడంతో విద్యార్థులు, ఉద్యోగులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

వైద్యశాఖాధికారికి సీఐటీయూ సమ్మె నోటీసు



సరూర్‌నగర్ వైద్యాధికారికి సమ్మె నోటీసు అందజేస్తున్న సీఐటీయూ నాయకులు

ఎల్‌బీనగర్: వైద్య ఆరోగ్యశాఖలో పని చేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని సీఐటీయూ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు కీసరి నర్సిరెడ్డి డిమాండ్ చేశారు. గత 20 ఏళ్లుగా వైద్యశాఖలో పని చేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగుల సర్వీసును క్రమబద్ధీకరించకుండా కొత్త ఉద్యోగ నియామకాలు చేపట్టడాన్ని నిరసిస్తూ శనివారం సీఐటీయూ ఆధ్వర్యంలో సరూర్‌నగర్ వైద్యశాఖాధికారికి సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా నర్సిరెడ్డి మాట్లాడుతూ, గతంలో కాంట్రాక్ట్ ఉద్యోగుల నియామకం చేపట్టినప్పుడు కూడా పరీక్షలు నిర్వహించారని, వారిని రెగ్యులర్ చేయకుండా మరోసారి పరీక్షలు పెట్టి కొత్తవారి నియామకాలు చేపట్టడం నిలిపివేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు విజయ, సుజాత, స్వర్ణలత, ఈశ్వరమ్మ, అలివేలు, శకుంతల, సరిత, అనురాధ, అన్నపూర్ణ, శశికళ తదితరులు పాల్గొన్నారు.

కాపుల అభ్యున్నతికి కేసీఆర్ కృషి: తోట

నాగోలు: రాష్ట్రంలోని కాపుల అభ్యున్నతికి ముఖ్యమంత్రి కేసీఆర్ నిరంతరం కృషి చేస్తున్నారని బీఆర్ఎస్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ తోట చంద్రశేఖర్ అన్నారు. ఎల్‌బీనగర్ కాపు సంక్షేమ సేన కన్వీనర్ లయన్ డాక్టర్ బి.విజయరంగ, శ్రీకర్ణ శ్రీనివాస్‌లు తోట చంద్రశేఖర్‌ను శనివారం అతని నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, దక్షిణ భారతదేశంలో నివసిస్తున్న కాపు, బలిజ, ఒంటరి, తూర్పు కాపు, తెలగ వారికి హైటెక్ సిటీ వద్ద 6.78 ఎకరాల స్థలాన్ని తోట చంద్రశేఖర్ కృషితో ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి కేటీఆర్ కేటాయించినందుకు వారు రాష్ట్రంలోని కాపు సంఘాల తరఫున ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో సంఘం నాయకులు డాక్టర్ ఇందిరా ప్రియదర్శిని, న్యూ మారుతి నగర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు నోముల కృష్ణమూర్తిగౌడ్, జెన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

యువజనులంతా ఓటర్లుగా నమోదు చేసుకోవాలి



సాయినగర్‌లో ఓటరు నమోదు ప్రక్రియను పరిశీలిస్తున్న కార్పొరేటర్ భాగ్యలక్ష్మి

మలక్‌పేట: ఓటు హక్కు ఎంతో విలువైందని, 18 ఏళ్ల వయస్సు నిండిన యువజనులంతా కొత్తగా ఓటర్లుగా నమోదు చేయించుకోవాలని మూసారంబాగ్ కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మీ మధుసూదన్‌రెడ్డి కోరారు. జీహెచ్‌ఎంసీ సర్కిల్–6 ఆధ్వర్యంలో శనివారం సాయినగర్‌లో చేపట్టిన ఓటరు నమోదు ప్రక్రియను కార్పొరేటర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, కొత్త ఓటరు నమోదుతో పాటు ఇప్పటికే ఓటు ఉన్నవారు ఓటర్ కార్డులో సవరణలు అవసరమైతే చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రోగ్రామ్ ఇన్‌చార్జి డీఈఈ బన్సీలాల్, ఖలీద్, మజర్, గుండప్ప, పద్మావతి, ఆండాలు, కాలనీవాసులు బైన్వాడీ రాజేష్, కొంగర ప్రవీన్, సంపత్, అమిత్, రవీందర్ పాల్గొన్నారు.

ఓటరు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

సైదాబాద్: కాలనీలు, బస్తీల్లో ఏర్పాటు చేస్తున్న ఓటరు నమోదు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని స్థానికులకు సైదాబాద్ డివిజన్ కార్పొరేటర్ కొత్తకాపు అరుణారవీందర్‌రెడ్డి కోరారు. శనివారం డివిజన్ పరిధిలోని గాంధీనగర్ బస్తీలో ఏర్పాటు చేసిన ఓటరు నమోదు కేంద్రాన్ని కార్పొరేటర్ పరిశీలించారు. బిల్ కలెక్టర్ ఆనంద్, బీఎల్ఓ అరుణ పాల్గొన్నారు.

జాతీయ చేనేత దినోత్సవాన్ని జయప్రదం చేయండి



మన్సూరాబాద్: బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా చేనేత సెల్ ఆధ్వర్యంలో ఆదివారం ఆటోనగర్‌లోని కర్నాటి గార్డెన్స్‌లో నిర్వహిస్తున్న జాతీయ చేనేత దినోత్సవాన్ని జయప్రదం చేయాలని బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి పిలుపునిచ్చారు. ఎల్‌బీనగర్ చంద్రపురికాలనీలోని జిల్లా పార్టీ కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, జాతీయ చేనేత దినోత్సవానికి ముఖ్యఅతిథులుగా కేంద్రమంత్రి, రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు జి. కిషన్‌రెడ్డి, ఎలక్షన్ కమిటీ చైర్మన్ ఈటల రాజేందర్‌తో పాటు పలువురు రాష్ట్ర నేతలు హాజరవుతున్నట్లు తెలిపారు. వివిధ జిల్లాల నుంచి వలస వచ్చిన చేనేత వృత్తిదారులు ఎల్‌బీనగర్ నియోజకవర్గంలో అత్యధికంగా ఉన్నారని, వారంతా ఈ కార్యక్రమానికి హాజరై విజయవంతం చేయాలని కోరారు. బీజేపీ నాయకులు కటకం నర్సింగ్‌రావు, జిల్లా చేనేత సెల్ చైర్మన్ రఘురామ్‌నేత, చిల్కూరి మాధవి, యాదగిరి, జ్ఞానేశ్వర్, గట్టు రవి, కర్నాటి మాధవి పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి స్పందన

ఎల్‌బీనగర్: బీఎన్‌రెడ్డి నగర్ డివిజన్ హరిహరపురం కాలనీ కమ్యూనిటీ హాల్‌లో నిర్వహించిన ఆయుర్వేద, యునానీ వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. కాలనీ సీనియర్ సిటిజన్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఆయుర్వేద వైద్యులు పాల్గొని పరీక్షలు చేసి మందులు అందజేశారు. వైద్యసిబ్బంది భవాని, వెంకటయ్య, ఝాన్సీ, రమాదేవి, మాధవి, గణేష్‌కుమార్, సీనియర్ సిటిజన్ సంఘం సభ్యులు మూర్తి, ఈశ్వర్, హనుమంత్‌రెడ్డి పాల్గొన్నారు.

యుద్ధప్రాతిపదికన చెత్తను తొలగించాలి

హస్తినాపురం: డివిజన్ పరిధిలోని చాలా ప్రాంతాలలో పేరుకుపోయిన చెత్తా చెదారాన్ని తొలగించి అంటు వ్యాధుల నుంచి ప్రజలను కాపాడేందుకు అన్ని విధాలా చర్యలు తీసుకుంటామని హస్తినాపురం డివిజన్ కార్పొరేటర్ బానోతు సుజాతా నాయక్ అన్నారు. శనివారం ఆమె హస్తినాపురం డివిజన్ నందనవనం కాలనీలో పర్యటించి కాలనీలో పేరుకుపోయిన చెత్తను పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ, డివిజన్ పరిధిలోని చాలా ప్రాంతాలలో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని యుద్ధప్రాతిపదికన తొలగించేందుకు అధికారులు సత్వర చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో మమత, మల్లేశ్‌గౌడ్, బీఆర్ఎస్ నాయకులు మల్లికార్జున్, గోపిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

సైదాబాద్: చెట్ల కొమ్మల తొలగింపు, పలు మరమ్మతు పనుల కారణంగా ఆదివారం ఆస్మాన్‌ఘడ్ ట్రాన్స్‌కో డివిజన్ పరిధిలోని ఈ కింది తెలిపిన ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని డీఈ హన్మంత్‌రావు తెలిపారు.

- ఉ. 8 నుంచి 11 గంటల వరకు... అన్మోల్ హోటల్, అల్‌సఫా డైయిరి, జోరాబీ దర్గా పరిసరాలు
- ఉ. 11 నుంచి మ. ఒంటి గంట వరకు... అలీనగర్, ఎంసీహెచ్ కాలనీ, గవర్నమెంట్ స్కూల్, జ్యోతిబాగ్, కార్ఖానా, బన్నాక, ఈదీబజార్, సీతమ్మతోట పరిసర ప్రాంతాలు
- మ.3 నుంచి సా.5 గంటల వరకు.. జీఎం నగర్, మిధానీ డిపో పరిసర ప్రాంతాలు.

ఇన్‌స్పెక్టర్ బాధ్యతల స్వీకరణ



కె.శ్రీనివాస్

చైతన్యపురి: సరూర్‌నగర్ ఇన్‌స్పెక్టర్‌గా కె.శ్రీనివాస్ శనివారం బాధ్యతలు చేపట్టారు.ఇక్కడ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేసిన జానకిరెడ్డి పదోన్నతిపై ఎల్‌బీనగర్ ఏసీపీగా బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో మలక్‌పేట ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ ఇక్కడికి బదిలీపై వచ్చారు.